
# తీరని కోరిక

Vemakoti Seeta Rama Sastry
WRITER APSEB J[illegible]
RAMAKRISHNA NAGAR
Plot No. 24
SRIKAKULAM.



— పి. వాణి

చిమ్మ చీకట్లలో కి సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ స్పీడ్‌గా పరుగెడుతోంది. బెర్తుమీద పడుకొన్న శ్రీదేవికి సంతోషంతో నిద్రపట్టటంలేదు. ప్రక్కనే పడుకొన్న సంవత్సరన్నర పాప రైలు ఊపే ఉయ్యాలలా సుఖంగా నిద్రపోతోంది. శ్రీదేవికి భవిష్యత్ గురించి ఆలోచిస్తే ఎంతో ఆనందంగా వుంది. జీవితంలో ఆనందం కల్గించేది ముఖ్యంగా భవిష్యత్తు మీద తీయటి ఆశే. ప్రక్క బెర్త్‌పై పడుకొన్న భర్త ప్రభాకర్ వంక చూసింది. ఆమెకి తన ప్రక్కనున్న పాప, భర్త ఒక్కలాగే అనిపించారు. అతనూ అమాయకంగా నిద్ర పోతున్నాడు.

ఆమెకి గతం గుర్తుకొచ్చింది. ఆమెకి జీవితంలో రెండే కోరికలు. అవి తీరతాయని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. తమ వూరిలో అందరిలాగే ఏడవ తరగతితో చదువు మానేయమంటే పట్టుదలగా ఇంట్లో పోట్లాడి పిన్నిగారింటికెళ్ళి చదువు కొన

సాగించింది. మళ్ళీ సెకన్ క్లాస్ ఫస్ట్‌క్లాస్‌లో పాసయిన తరవాత బ్రేక్ పడబోయింది. కానీ ఆమె ఉత్సాహం చూసి చిన్నన్న ఇచ్చిన చేయూతతో నిరాటంకంగా డిగ్రీ వరకూ కొనసాగించింది. అట్లా ఆమె మొదటికోరిక తీరి రెండోకోరికకి ప్రాణం ఇచ్చింది.

డిగ్రీ అయ్యేటప్పటికి ఆమె తండ్రి పెళ్ళి సంబంధంతో రెడీగా వున్నారు. అప్పటివరకు సెలయేటిలా పరవళ్ళు త్రొక్కిన ఆమె జీవితం ప్రభాకర్ ఆగమనంతో జీవనదిలా మారింది. ఫలితం పాప.

ప్రభాకర్‌ని చూసి ప్రతి ఒక్కరు మంచివాడని తన అదృష్టాన్ని పొగడుతుంటే ఆమె పొంగి పోయేది. నిజమే, ఏ విషయంలోనూ ఆమెని నొప్పించక ప్రవర్తించేవాడు.

ప్రభాకర్ సిమెంట్ ఫాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతనికి వచ్చే ఎనిమిది వందలతో ఇల్లు గడవాలంటే, క్రొత్త కాపురం కష్టంగా వుండేది. అందుచేతే చిన్న చిన్న ఒడిదుడుకులు. అప్పట్నుంచి ఆమెలో రెండోకోరిక పెరగసాగింది.

ఒకరోజు జీవితం ఎంతో ఆనందంగా మారుతుం దన్న ఉత్సాహంతో, భర్తమీద ఎంతో నమ్మకంతో తన కోరికను బయటపెట్టింది.

"ఏమండీ, మనకి కేవలం మీ జీతంతోనే ఇల్లు గడవాలంటే ఇబ్బందిగానే వుంది గదా. ప్రతినెలా వందో, రెండొందలో బయట్నుంచి అప్పు చేయాల్సి వస్తున్నది. నేను కూడా జాబ్‌చేస్తే?" అంది అర్థోక్తిగా.

ప్రభాకర్ నవ్వి వూరుకున్నాడు,

మళ్ళీ అడిగింది.

"నిజమే, ఫైనాన్షియల్‌గా బాగానే వుంటుంది. కానీ నాకు, నువ్వు ఇంటిదగ్గరే వుండి పాపని, నన్నూ చూచుకోవటమే ఇష్టం. ఇంక నాకు రెండు మూడేళ్ళలో ప్రమోషన్ వస్తుంది. వస్తే జీతం వెయ్యి రూపాయలు దాటుతుంది. ఇంక ఈ ట్రబుల్స్ వుండవు" అన్నాడతను.

"అదికాదు. అంత అవసరం లేకపోతే మానే స్తాను. చెయ్యడం కుదరకపోయినా మానేస్తాను. ప్లీజ్. ఈ విషయంలో అడ్డుచెప్పద్దు. నాకు జాబ్ చెయ్యడమంటే ఎంతో ఇష్టం. దానికి కారణం మనం ఇంకా హాయిగా బ్రతకవచ్చని. మొద ట్నుంచీ నా కోరిక అదే, నా భర్తకి అవిధంగా సహాయపడాలని" అంది శ్రీదేవి గబగబ.

"సరేలే, నీ ఇష్టం. కాని నీకు ఇప్పుడు ఉద్యోగం ఇచ్చేది ఎవరు? ఏవన్నా దొరికినప్పుడు కదా," అన్నాడతను ఆ సంభాషణ త్రుంచివేస్తూ.

కానీ రెండురోజుల తరువాత శ్రీదేవికి వెదక బోతున్న తీగ కాలికి తగిలినట్లయింది. ప్రక్కింటామె కాన్వెంట్ నడుపుతోంది. ఆమె అడిగింది,


"మీరు సైన్స్‌లో గ్రాడ్యుయేట్ కదా. మా కాన్వెంటులో సైన్స్‌టీచర్‌గా ఒకర్ని అప్పాయింట్ చేసుకోవాలనుకొంటున్నాము. మీరు చేస్తారా?"

శ్రీదేవి సంతోషంగా ఒప్పుకుంది.

సాయంకాలం ఇంటికి రాగానే కుర్చీలో కూర్చుని బూట్లు విప్పుకుంటున్న ప్రభాకర్‌తో చెప్పింది.

"ఏదో సరదాగా అన్నావనుకొన్నాను. ఆ ప్రయత్నంలోనే వున్నావన్నమాట, మరి, పాప?" అన్నాడు నవ్వుతూ.

"పాపని మా అమ్మవాళ్ళ దగ్గర వదిలి పెడ

కేశవర్ధిని...
పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం

పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె

అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్దిచుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

ఆరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




కేశవర్ధిని
తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స్ మద్రాసు-600 087

OBM 8473/ TG

తాను.''

"అయితే అది కూడా ఆలోచించావన్నమాట. చూడు దేవీ, పిల్లల్ని నా ఉద్దేశం ప్రకారం తల్లి తండ్రులే పెంచాలి. మన ప్రతిరూపాలు వాళ్ళు. మనకున్న ఆదర్శాల కనుగుణంగా వాళ్ళని పెంచాలి. అదే మన పెద్దవాళ్ళదగ్గర వుంచితే వాళ్ళు పెంచడానికి మనం పెంచడానికి చాలా వ్యత్యాసం వుంటుంది. ఎందుకంటే వాళ్ళకీ, మనకీ ఎంతో అంతరం వుంటుంది. వాళ్ళ ప్రతీ ఆలోచన మనకి చాదస్తంగా అనిపిస్తుంది. వాళ్ళకీ, మనకీ మధ్య నున్న ఇరవైయేళ్ళ తేడా గురించి ఆలోచించు. ఇంక మన పిల్లల్ని వాళ్ళ దగ్గర పెంచితే ఎంత తేడా వుంటుందో ఆలోచించు. నా మాటలు అర్ధం చేసుకోగలవనుకుంటున్నా'' అన్నాడు కుర్చీ లోంచి లేస్తూ ఇంకో మాటకి అవకాశం ఇవ్వకుండా.

తరువాత కొన్నాళ్ళకి శ్రీదేవి వాళ్ళ పిన్నిగారింటికి వెళ్ళింది. ఆమె అక్కడ తను చదివిన స్కూల్ హెడ్ మిస్ట్రెస్‌ని కలిసింది. శ్రీదేవి గురించి విని ఆమె అంది—

"మన స్కూల్‌లో రికార్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీ వున్నాయి. నీకు ఇష్టమయితే చెప్పు నేను రికమెండ్ చేస్తాను. మంచి జాబ్. 600 రూపాయల వరకు వస్తుంది.''

"థ్యాంక్ యూ, మేడమ్. తప్పకుండా చేస్తాను'' అంది ఒక నిశ్చయానికి వచ్చి.

"అయితే వెంటనే అప్లై చెయ్యి.''

"ఈ రోజే అప్లై చేస్తాను.''

ఇంటికొచ్చి పిన్నితో అంతా చెప్పింది. అక్కడే వుండి అంతా వింటున్న అమ్మమ్మ అంది.

"నువ్వన్నట్లు పాపని నువ్వులేనప్పుడు పిన్ని చూస్తుంది. బాగానే వుంది. కానీ, ఆ అబ్బాయి అక్కడ వందమైళ్ళ దూరంలోనూ, నువ్వేమో ఇక్కడా వుండి వుద్యోగాలు చేసుకొంటూ బ్రతుకుతారా?''

ఇంటర్ చదువుతున్న అక్కడే కూర్చున్న పిన్ని కొడుకు రాము అన్నాడు.

"అమ్మమ్మా, భార్యాభర్తల్ని ఒకే చోట పని చేయడానికి ప్రభుత్వం అనుమతిస్తుంది. అందుచేత తర్వాత ట్రాన్స్‌ఫర్ చేయించుకోవచ్చు.''

"అలాగా, నాకు తెలియదులే, ఎక్కడయిన సిమెంటు ఫాక్టరీలో పనిచేసే సూపర్‌వైజర్ని స్కూల్‌కి ట్రాన్స్‌ఫర్ చేస్తారా'' అందామె వెటకారంగా.

ఆమె ఆర్గ్యుమెంటుకి తిరుగులేదు. అంతా వింటున్న శ్రీదేవికి ఒళ్ళుమండి అంది కోపంగా.

"ఏమవుతుందే...ఏమవుతుంది, వేరుగా వుండి ఉద్యోగాలు చేసుకోకూడదా?''

"నువ్వొట్టి మొండిపిల్లవి. నీ ధోరణి నీదే కాని వేరొకళ్ళని వినిపించుకోవు'' అంది వాళ్ళ అమ్మమ్మ ఆ కోపానికి భయపడి.

శ్రీదేవి భర్తకి చెప్పి అప్లై చేద్దామని నిర్ణయించుకొంది. 'కానీ అతనూ వద్దంటే?'

'అతనితో దెబ్బలాడైనా చెయ్యాలి. అయినా అసలేమవుతుందో చూద్దాం' అనుకొంది,

వూరునుంచి ఇంటికి రాగానే చెప్పింది.

"చూడు శ్రీదేవి, నావి చాలా చిన్న కోరికలు. ఇంటికొచ్చిన తరువాత నీతోను, పాపతోను సరదాగా గడపాలని. నాకు ఈ ఆర్థిక ఇబ్బందులు పెద్దవి కావు. జీవితంలో ప్రతీవాటికీ ఎడ్జెస్ట్ అవడం ముఖ్యం. ఇదీ అంతే, ఇంకెప్పుడూ ఇటువంటి ప్రయత్నం చెయ్యకు'' అన్నాడు కొద్దిగా కటువుగా.

శ్రీదేవి నీరుకారిపోయింది. మొదటిసారిగా అనుకొంది అతని గురించి, "ఎంతయినా మగ బుద్ధులు ఎక్కడికిపోతాయి. ఏం, తనేం తప్పుపని చేయటం లేదుకదా, తన పాప, ఆయన ఇంకా సుఖపడటానికి సహాయపడతాననంటుంది. అది అర్ధం చేసుకోకుండా ఏవేవో చెప్తున్నారు. "ఫస్టు వచ్చిన తరువాత ఒక వారం రోజులు మాత్రమే చేతిలో డబ్బులు వుండేది. ఇంక మిగతా మూడు వారాలు ఏమొచ్చినా వచ్చే నెల చూద్దాములే అన్న ధోరణిలో వుండాలి, ఎన్నాళ్ళిలా? ఈయన ఎందుకు అర్ధం చేసుకోరు?''

కానీ అతనితో మళ్ళీ ఆ విషయం అనటానికి భయపడింది. ఇంకో ఐదు నెలలు గడిచాయి. ప్రభాకర్‌ని హైద్రాబాద్‌లో క్రొత్తగా కడుతున్న సిమెంట్ ఫాక్టరీకి ట్రాన్స్‌ఫర్ చేసారు. ప్రభాకర్ హైద్రాబాద్ వెళ్ళి ఇల్లు చూసి వచ్చాడు.

ఇంక శ్రీదేవి ఆనందానికి అంతులేదు. ఆమె ఎప్పుడూ రాష్ట్ర రాజధానిని చూడకున్నా అక్కడ పరిస్థితి తెలుసు. "ఎన్నో కంపెనీలుంటాయి. ఏదో కంపెనీలో తనకి జాబ్ తప్పకుండా వస్తుంది. పాపకి రెండో సంవత్సరం వస్తుంది కనుక ఏ బేబీ కేర్ సెంటర్‌కో పంపించవచ్చు రోజూ'' అనుకొని తన కోరిక తీరుతుందనే ఆశతో వుంది.

ప్రభాకర్ ఫాక్టరీకి దగ్గరలో సరూర్‌నగర్‌లో ఇల్లు తీసుకొన్నాడు. ఒక నెల రోజులు హడావిడిగా గడిచిపోయింది. ఇల్లు సర్దుకోవడంలో హడావిడిగా వున్నా ఆమె జాబ్ గురించి తన ప్రయత్నాలు మానలేదు. పేపర్‌లో ఎడ్వర్‌టైజ్ చేసిన జాబ్‌కి అప్లై చేసింది.

ఇంకో నెల గడిచింది. ఒకరోజు–ఒక ప్రైవేట్ కంపెనీ నుంచి వచ్చిన ఆర్డర్స్ చూసి ఆనందంతో తలమునకలయింది. రెండ్రోజుల తర్వాత ఇంటర్వ్యూకి రమ్మనమని వచ్చిన ఆర్డర్ అది.

ఆ రాత్రి భర్త మంచి మూడ్‌లో వుండగా చెప్పింది.

"అయితే, నీ ప్రయత్నంలో నువ్వు వున్నావన్న మాట. ఏదీ చూపించు. ఆ ఆర్డర్స్'' అన్నాడు నవ్వుతూ.

శ్రీదేవి తెచ్చి ఇచ్చింది

దీ డిప్యూటి మేనేజర్
బి. ఆర్. కన్‌సల్టెంట్స్ (ప్రై) లిమిటెడ్
బాలానగర్

అని ఎడ్రస్ చదివి "ఓహో ఆ కంపెనీ బాలానగర్‌లో వుందన్నమాట.'' "ఇక్కడికి బాలానగర్ ఎంతదూరమో తెలుసా?'' "నీకు వెంటవెంటనే బస్‌లు దొరికితే రెండున్నర గంటలు జర్నీకి పడుతుంది. అంటే రోజుకి ఐదుగంటలు పడుతుంది. అందులో ప్రైవేట్ కంపెనీ అయితే ఎక్కువసేపు చేయించుకొంటారు. 'అసలు చెయ్యగలవా?' అన్నమాట అటుంచు. బస్‌లు దొరక్కపోతే ఎన్నింటికి వస్తావో, ఎట్లావస్తావో. ఊహూం... బాగా దగ్గరయితే తప్ప దూరంగా వెళ్ళి నువ్వు జాబ్ చేసి వస్తే మనం ఇట్లా ఏ ఒక్కరోజూ వుండలేము.

"శ్రీదేవీ? నిన్ను డిస్కరేజ్ చేస్తున్నా అనుకోకు. ఇద్దరం జాబ్ చేస్తే రకరకాల సమస్యలు ఇప్పుడు మనకున్నది ఒకటే సమస్య నేను ఇవ్వన్నీ ఆలోచించే అంటున్నాను. ఈ ఆర్థిక పరిస్థితి ఇట్లా వున్నా ఫరవాలేదు. కానీ ఆ జీవితం భరించలేము'' అన్నాడు లైటార్పుతూ.

శ్రీదేవికి నిరాశతో అనిపించింది, "ఇక తన కోరిక తీరదు.'' అని. ఆమె వెచ్చని కన్నీళ్ళు తలగడని తడిపి వేస్తున్నాయి. □